క్లుప్తంగా

ఆలయ హుండీ సొమ్ము లెక్కింపు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

కడప కల్చరల్ : కడప నగరం మున్సిపల్ మైదానంలోగల శ్రీ రాజరాజేశ్వరీదేవి ఆలయ హుండీ ఆదాయాన్ని గురువారం లెక్కించారు. దేవాదాయశాఖ నుంచి కార్యక్రమాన్ని పర్యవేక్షించేందుకు ఇన్‌స్పెక్టర్ జి.రమణమ్మ హాజరయ్యారు. ఆలయ ఈఓ ఎ.శ్రీధర్ ఆధ్వర్యంలో హుండీల సొమ్మును ఆలయ ప్రాంగణంలో లెక్కించారు. గత సెప్టెంబరు 11 నుంచి ఇప్పటి వరకు హుండీల ద్వారా ఆరు నెలల పాటు రూ. 1.43,678 సొమ్ము లభించినట్లు ఈఓ తెలిపారు. సొమ్ము లెక్కింపులో అర్చకులు, సిబ్బంది, భక్తులు, మాజీ చైర్మన్ కె.ఉమేష్, మాజీ ధర్మకర్త అబ్బిశెట్టి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం



కడప కార్పొరేషన్: కడప నగరం కో ఆపరేటివ్ కాలనీలోని శ్రీ సాయిబాబా అనాథ శరణాలయంలో ఆరవేటి రుక్మానంద, భాగ్యశ్రీ ఆధ్వర్యంలో గురువారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ తమ కుమారుడు జగదీశ్వర్ పుట్టిన రోజును పురస్కరించుకొని అనాథలకు అన్నదానం చేయడం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆరవేటి శ్రీనివాసులు, జయమ్మ. పి. శ్రీనివాసులు, టి. తారక, శరణాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తెప్పోత్సవానికి ఏర్పాట్లు

కడప కల్చరల్ : కడప నగరంలోని అమ్మవారిశాల వద్ద భక్తులు వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం తెప్పోత్సవాన్ని నిర్వహించనున్నారు. ఇందుకోసం ఆలయం వద్ద ప్రత్యేకంగా తాత్కాలిక పుష్కరిణి ఏర్పాటు చేస్తున్నారు. నిపుణులైన ఇంజనీర్ల ఆధ్వర్యంలో 40 ఇంటు 20 సైజులో పుష్కరిణి నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఇందులో తెప్పను ఏర్పాటు చేసి అందులో అమ్మవారిని ప్రతిష్ఠించి తెప్పోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం తెప్పను ప్రత్యేకంగా తయారు చేస్తున్నారు. ఆదివారం నాటికి తెప్ప సిద్ధం కానుందని నిర్వాహకులు తెలిపారు.

బ్రౌన్ గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు



పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు

కడప కల్చరల్ : జ్ఞానానికి నిలయమైన సీపీ బ్రౌన్ గ్రంథాలయాన్ని గురువారం కడప నగరానికి చెందిన నాగరాజుపేటలోని మునిసిపల్ కార్పొరేషన్ గుండాచారి హైస్కూల్ విద్యార్థులు సందర్శించారు. ఉపాధ్యాయులతో కలిసి వచ్చిన వారికి బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి అక్కడి అన్ని విభాగాలను చూపించి అందులోని పుస్తకాల గురించి వివరించారు. విద్యార్థులు ప్రధానంగా కథలు, బొమ్మలు గల చిన్న కథల పుస్తకాల గురించి అడిగి తెలుసుకోవడం , సిబ్బంది ద్వారా వాటిని తీసుకుని చిన్న కథలను చదివి, బొమ్మలను చూసి ఆనందించడం విశేషం. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కార్పొరేషన్ హైస్కూల్ (గుండాచారి) ఉపాధ్యాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో మెడికల్ మాఫియాని అరికట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: జిల్లాలో ప్రైవేటు ఆసుపత్రులు పేద ప్రజలను పీడించుకు తింటున్నాయని అధికారులు స్పందించి మెడికల్ మాఫియాను అరికట్టాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్, జిల్లా కార్యదర్శి శరత్ కుమార్ లు పేర్కొన్నారు. గురువారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ జిల్లాలో ప్రవేట్ ఆసుపత్రుల్లో ఓపీ మొదలు కొని మందుల వరకు పూర్తిగా పేద ప్రజలకు అందుబాటులో లేకుండా ఉన్నాయని వాపోయారు. ప్రైవేట్ ఆస్పత్రులు, డయాగ్నస్టిక్స్ సెంటర్లు, చిన్నపిల్లల కేర్ సెంటర్లు విచ్చలవిడిగా ఏర్పాటు చేసుకొని ఒక్కొక్క హాస్పిటల్లో ఓపి రూ.200 పెట్టి చిన్న రోగంతో వెళ్లినా లేనిపోని టెస్టులు రాసి వేలకు వేలు దండుకుంటున్నారని ఆరోపించారు. ఆర్ఎంపి సెంటర్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి శివ నాగేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు బలరాం నాయక్ పాల్గొన్నారు.

గతుకుల రోడ్లు ఇంకెన్నాళ్లు..



కడప నగరం నడి బొడ్డున ఉన్న ఓల్డ్ రిమ్స్ ప్రధాన రహదారి ఇది. ఈ మార్గంలో రోడ్డు గతుకులమయంగా మారింది. కంకర తేలి అస్తవ్యస్తంగా ఉంది. అయినా అధికారులు పట్టించుకోరు. ఈ రహదారిన ప్రభుత్వ కార్యాలయాలకు పోయే ఉద్యోగులు, ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు ఇటు వైపు తిరిగి చూసిన దాఖలాలు లేవు. జిల్లా అధికారులు ఇకనైనా స్పందించి నూతన రోడ్డు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించి నియమించే డిపార్టుమెంట్, చీఫ్ సూపరింటెండెంట్లను కనీసం 6 సంవత్సరాలు సర్వీసు పూర్తి చేసుకున్న వారిని నియమించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల శివార్జున డిమాండ్ చేశారు. ఈ విషయమై గురువారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి పరీక్షల విధులకు సంబంధించిన చీఫ్‌లు, డిపార్టుమెంట్ ఆఫీసర్లకు అతి తక్కువ సర్వీస్ ఉన్న పాఠశాల సహాయకులను నియమిస్తున్నారన్నారు. ఈ విషయంలో కనీసం 6 సంవత్సరాల సర్వీసు పూర్తి చేసిన వారిని నియమించాలన్నారు. ప్రస్తుతం పాఠశాల సహాయకులను పదవ తరగతి ఇన్విజిలేటర్లుగా నియమించాలని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇది సరైనది కాదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం, అధికారులు ఆలోచించాలన్నారు. అదే విధంగా సీనియారిటి జాబితాలోని అభ్యంతరాలను స్వీకరించే గడువు తేదీని పొడిగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుదర్శన్‌బాబు, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయాలి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో ఉన్న బ్యాగ్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని మాలమహానాడు(పెంటారావు వర్గం) జిల్లా అధ్యక్షుడు పులిమి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి ఏళ్లు కావస్తున్నా మాలలు ఇంకా ఆర్థికంగా వెనుక బడి ఉన్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికీ ఇళ్లు, ఇళ్ళ స్థలాలు కోసం పోరాటం చేయాల్సి వస్తోందని చెప్పారు. ఎస్సీ కార్పొరేషన్ ద్వారా రుణాలు మంజూరు చేయాలని, భూమి లేని పేదలకు భూములు ఇవ్వాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ ఓట్ల కోసం దళితులను విభజించి, పాలించు అనే విధంగా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. దళితుల సామాజిక అభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని కోరారు. మాలలకు జరుగుతున్న అన్యాయంపై పోరాటం చేస్తామన్నారు.

విద్యార్థుల ప్రతిభ



ఖాదర్‌బీ



సంతోష్ కుమార్‌రెడ్డి

కడప ఎడ్యుకేషన్: జేఎన్టీయూఏ విడుదల చేసిన ఎంసీఏ, ఎంబీఏ ప్రథమ సెమిస్టర్ పరీక్షా ఫలితాల్లో కడప రిమ్స్‌రోడ్డులోని స్పిరిట్స్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను చాటారు. ఎంసీఏ విభాగంలో ఖాదర్ బీ(84.6%), హర్షవర్ధన్ (84.4%), లావణ్య (82. 8%) మార్కులతో కాలేజీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో టాపర్స్‌గా నిలిచారు.

- ఎంబీఏ విభాగంలో సంతోష్‌కుమార్‌రెడ్డి(80.7%), రచన(80.6%) వెంకట హరినాథ్(80.4%) మార్కులతో కాలేజీ ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో టాపర్స్‌గా నిలిచారు. మంచి మార్కులతో ఉత్తీర్ణులైన విద్యార్థులను కళాశాల అధినేత నిర్మల, సంచాలకులు ఎంసీ రవీంద్ర, ఉపాధ్యక్షులు శ్రీకాంత్‌కుమార్ అభినందించారు.

మురుగు సమస్య పరిష్కరించండి



రోడ్డుపై పారుతున్న మురికి నీటి వద్ద స్థానికులు



ఓం శాంతినగర్ రోడ్డు నంబరు 17లో రోడ్డుపై మురికికుంట

కడప కోటిరెడ్డిసర్కిల్ : తమ ప్రాంతంలో డ్రైనేజీ నీటి సమస్య కారణంగా దుర్వాసన భరించలేకున్నామని సమస్య తీవ్రతను గుర్తించి సంబంధిత అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కడప నగరం ఓం శాంతినగర్ రోడ్డు 17 ప్రాంత వాసులు కోరుతున్నారు. గురువారం ఈ మేరకు బాధిత ప్రజలు సమస్యను మీడియా దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని రోజులుగా తమ ప్రాంతంలో డ్రైనేజీ నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ ప్రాంతంలో రోజుల తరబడి మురికి నీరు నిలబడి ఉంటోందని, అప్పుడప్పుడు కార్పొరేషన్ వాహనం వచ్చి మురికి నీటిని తరలిస్తున్నారే తప్ప సమస్యకు శాశ్వత పరిష్కారం చూపడం లేదన్నారు. ఈ సమస్య పరిష్కరించాలని కోరారు.

కంటెంజెంట్ వర్కర్ల కొనసాగింపు

- వైఎస్సార్ ఆడిటోరియాన్ని ఏడాది లీజుకిచ్చేందుకు అనుమతి
- నగరపాలక స్టాండింగ్ కమిటీలో నిర్ణయాలు



స్టాండింగ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ సురేష్‌బాబు

కడప కార్పొరేషన్: కడప కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 454 మంది కంటింజెంట్ వర్కర్లను తిరిగి కొనసాగించేందుకు స్టాండింగ్ కమిటీ అనుమతిచ్చింది. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ సురేష్ బాబు అధ్యక్షతన ఆయన ఛాంబర్‌లో స్టాండింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్‌లో క్లాప్ వాహనాలకు లోడర్లుగా, పూడిక తీసేవారుగా, నైట్ లోడర్లుగా, నైట్ వర్కర్లుగా, కమర్షియల్ ఏరియా లోడర్లు, మార్కెట్ యార్డు, గోశాల, ఎంసీసీ, ఎఆర్ఎఫ్, జీటీఎస్‌లు, కంపోస్టు యార్డులలో పనిచేస్తున్న కంటింజెంట్ వర్కర్ల కాలపరిమితి 2025 జనవరి 31తో ముగిసినందున వారిని తిరిగి కొనసాగించేందుకు అనుమతిచ్చారు.

- మద్రాసు రోడ్డులోని వైఎస్సార్ ఆడిటోరియాన్ని ఏడాది పాటు లీజుకు ఇచ్చేందుకు ఓపెన్ టెండర్ నిర్వహించగా రూ. 14.20లక్షలు హెచ్చు పాట పాడిన మాజీ కార్పొరేటర్ ఇసుకపల్లి చైతన్యకు ఆడిటోరియాన్ని అప్పగించేందుకు తీర్మానించారు. వెల్లాల ప్రదీప్ కుమార్‌రెడ్డి వాటర్‌ప్లాంటు లీజు కాలపరిమితి ముగిసిన నేపథ్యంలో నిబంధనల మేరకు టెండర్ లేదా వేలం ద్వారా పొడిగించాలని నిర్ణయించారు. 12వ డివిజన్‌లో పుట్లంపల్లి నాలుగు రోడ్ల కూడలి వరకూ మంజూరైన కాలువను రద్దు చేసి, కాలువ లేనిచోట నిర్మించుటకు తీర్మానించారు. నగరపాలక పరిధిలోని జంతు వధశాలలు, గొర్రెల, మేకల వధశాలల, ఎద్దుల వధశాల, మేకల మాంసపు అంగళ్లు, ఎద్దుల మాంసపు అంగళ్లు 2025–26 నుంచి 2027–28 వరకూ 33.33 శాతం పెంపుదల చేసి గుత్త వసూలు చేయుటకు తీర్మానించారు. ఈ సమావేశంలో కమిషనర్ మనోజ్‌రెడ్డి, ఎంహెచ్‌ఓ డా. చంద్రశేఖర్, ఎస్‌ఈ చెన్నకేశవరెడ్డి, స్టాండింగ్ కమిటీ సభ్యులు మగ్బూల్ బాషా, కె. బాబు, బాలస్వామిరెడ్డి, అరీఫుల్లా బాషా, లక్ష్మిదేవి పాల్గొన్నారు.

వైవీయూలో క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి

కడప ఎడ్యుకేషన్: వైవీయూలో నిర్వహించిన క్యాంపస్ డ్రైవ్‌కు స్పందన లభించింది. యోగి వేమన విశ్వవిద్యాలయ ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య జి. విజయభారతి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో గురువారం రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌ను నిర్వహించారు. డ్రైవ్‌ను విశ్వవిద్యాలయ ప్రధాన ఆచార్యులు ఎస్ రఘునాథ్ రెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ ప్రారంభించారు. దివీస్ లాబొరేటరీస్ లిమిటెడ్, శ్రీ చైతన్య స్కూల్స్ ప్రతినిధులు రాత పరీక్ష ఇంటర్వ్యూ, డెమో ద్వారా వారి సంస్థలకు అవసరమైన వారిని ఎంపిక చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ప్లేస్‌మెంట్ సెల్ సభ్యులు డాక్టర్ రెడ్డయ్య, డాక్టర్ గణేష్ నాయక్, డాక్టర్ కె. లలిత పాల్గొన్నారు. హైదరాబాద్ దివిస్ లేబరేటరీ సంస్థతో వైవీయూ ప్లేస్‌మెంట్ సెల్ పరస్పర ప్రయోజనాల కోసం అంగీకార పత్రాలపై సంతకాలు చేశారు.

విద్యార్థులకు ఆన్‌లైన్ విధానంలో శిక్షణ, కార్యశాలల ద్వారా నైపుణ్యాలను పెంపొందిస్తారని ప్లేస్ మెంట్ సెల్ డైరెక్టర్ ఆచార్య విజయ భారతి వెల్లడించారు.

పోలీసుశాఖ ప్రతిష్టను పెంచాలి



జిల్లా ఎస్పీని కలిసిన ప్రొబేషనరీ ఎస్ఐలు

కడప అర్బన్: అనంతపురం పోలీసుశిక్షణ కళాశాలలో ఇటీవల శిక్షణ పూర్తి చేసుకుని, జిల్లాకు కేటాయించిన 7 మంది ప్రొబేషనరీ సబ్ ఇన్‌స్పెక్టర్లు జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్‌ను గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోలీస్ శాఖలోకి కొత్తగా చేరుతున్న ప్రొబేషనరీ ఎస్ఐలు రేనాటి శివనాగిరెడ్డి, జి. సూర్యనారాయణ రెడ్డి, ఎం. నాగకీర్తన, ఎం. సుబహాన్‌లకు ఎస్పీ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో నిష్పక్షపాతంగా అంకితభావం, క్రమశిక్షణ, నిజాయితీ, పారదర్శకంగా విధులు నిర్వర్తించాలన్నారు. ప్రజలకు అత్యుత్తమ పోలీస్ సేవలు అందించి, పోలీస్‌శాఖ ప్రతిష్టను మరింత పెంపొందించేలా విధి నిర్వహణ చేయాలని సూచించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాల గురించి అవగాహన పొందినందున సాంకేతికతను వినియోగించుకొని, ప్రజలకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. విధి నిర్వహణలో మంచి పేరు తెచ్చుకోవాలన్నారు.

పోస్టల్ సేవలపై అవగాహన కల్పించాలి



ఎస్‌హెచ్‌జీ సభ్యులతో మాట్లాడుతున్న పోస్టల్ డిపార్ట్‌మెంట్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ సచిన్ మిట్టల్

కడప కార్పొరేషన్: స్వయం సహాయక సంఘ సభ్యులు పోస్టల్ శాఖ అందించే సేవలను ప్రజలకు అవగాహన కల్పించాలని ఆ శాఖ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా. సచిన్ మిట్టల్ తెలిపారు. గురువారం పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ(మెప్మా) కార్యాలయంలో ఎస్‌హెచ్‌జీ సభ్యులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోస్టల్ డిపార్ట్‌మెంట్ అందించే సేవలు, పలు రకాలైన పథకాలను వివరించారు. వాటివల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాలను తెలుపుతూ వాటిని ప్రతి ఒక్కరికీ తెలియజేయాలని సూచించారు. పోస్టల్ శాఖ ద్వారా ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన సేవలను మెరుగ్గా ప్రజలకు అందిస్తున్నామని తెలపారు. ఈ కార్యక్రమంలో మెప్మా పీడీ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు మహిళా దినోత్సవ ముందస్తు వేడుకలు

కడప కల్చరల్ : అంతర్జాతీయ మహిళా దినోత్సవ సందర్భంగా శుక్రవారం సాయంత్రం స్థానిక ఎస్‌వీ ఇంజనీరింగ్ కళాశాలలో వేడుకలు నిర్వహించనున్నారు. భారత జాతీయ కళా సంస్కృతి వారసత్వ పరిరక్షణ సంస్థతోపాటు లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, ఎస్వీడీ ఇంజనీరింగ్ కళాశాల సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా ఇంటాక్ సంస్థలోని మహిళా మూర్తులతోపాటు ఇటీవల పలు రంగాలలో విశేష ప్రతిభ చూపుతున్న మహిళలను ఘనంగా సత్కరించనున్నారు. జేసీ అదితి సింగ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఆత్మీయ అతిథిగా యూనియన్ బ్యాంక్ అధికారిని లక్ష్మి తులసి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారి శ్రీ లక్ష్మి, సిద్ధవటం రేంజ్ అటవీశాఖ అధికారిణి చంద్రకళావతి ప్రత్యేక అతిథిగా హాజరుకానున్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి



పిల్లలకు అవగాహన కల్పిస్తున్న చిన్నచౌక్ పోలీసులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థి దశ నుంచే విద్యార్థులు పోలీసు సేవలు, సిబ్బంది విధులతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని పోలీసు అధికారులు సూచించారు. మహిళా సాధికారత వారోత్సవాల్లో భాగంగా గురువారం కడపలోని పలు పోలీసుస్టేషన్‌లను నగరంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు సందర్శించి పోలీసుల దైనందిన విధులపై ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పోలీసు స్టేషన్‌లో జరుగు విధులు, మహిళా సహాయ కేంద్రం, పోలీసుల పనితీరు, విధుల్లో వినియోగించే పరికరాలతోపాటు పలు రికార్డుల నిర్వహణ గురించి పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. అలాగే మహిళా చట్టాలు, పోక్సోయాక్ట్, ర్యాగింగ్, ఈవ్‌టీజింగ్, గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, సామాజిక మాధ్యమాలతోపాటు సైబర్ క్రైమ్స్‌పై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

వక్ఫ్ 'భక్షణ'చట్టాన్ని బహిష్కరించాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన వక్ఫ్ సవరణల చట్టం- 2024 వాస్తవంగా ఆస్తుల భక్షణ చట్టం అని ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్, నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు అఫ్జల్ ఖాన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఎం. రహమతుల్లా ఖాన్ విమర్శించారు. గురువారం నగరంలోని రెండో గాంధీ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు వక్ఫ్ చట్టానికి వ్యతిరేకంగా కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత సిరాజుద్దీన్, మహిళా నేతలు శ్యామలమ్మ, సంజయ్ కాంత , కాంగ్రెస్ పార్టీ డివిజన్ ప్రతినిధులు దినకర్ రెడ్డి, హమీద్, కమల్ బాషా, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ యువజన రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా వివేకానందరెడ్డి

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన జి. వివేకానందరెడ్డిని రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

సన్మానం



డాక్టర్ నజీముద్దీన్‌ను సత్కరిస్తున్న ఖాదర్‌బాష తదితరులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : జాతీయ దంత వైద్యుల దినోత్సవ సందర్భంగా రాష్ట్ర దంత వైద్యుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు, నగరానికి చెందిన దంత వైద్యులు డాక్టర్ షేక్ నజీముద్దీన్‌ను ఘనంగా సత్కరించారు. జేకే జనం కోసం యూత్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకులు లయన్ పఠాన్ ఖాదర్‌బాష ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సంఘం జాకీరుద్దీన్, జుల్ ఫకర్ హనీఫ్, దస్తగిర్, మహబూబ్‌బాషా, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసు 62 ఏళ్లకు పెంచాలి



ఎమ్మార్సీ ఎదుట ఆందోళన చేస్తున్న సిబ్బంది

కడప ఎడ్యుకేషన్: మండల వనరుల కేంద్రంలో పనిచేసే ఎమ్మార్సీ స్టాఫ్ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని మండల వనరుల కేంద్ర జేఏసీ డిమాండ్ చేసింది. గురువారం కడప మండల వనరుల కేంద్రంలో పనిచేసే సిబ్బందితోపాటు సీఆర్పీలు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ ఎంఆర్సీ స్టాఫ్ పదవీ విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలన్నారు. అలాగే హెచ్ఆర్ పాలసీ అమలు చేయడంతోపాటు మినిమం టైం స్కేల్‌ను అమలు చేస్తూ అసెంబ్లీలో ప్రకటన చేయాలన్నారు.